



నాటి బీఆర్ఎస్ పాలనలో గోదారి జలకళను, నేటి రేవంత్ పాలనలో ఎండిన నదిని పోల్చుతూ రూపొందించిన చిత్రపటాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అందజేస్తున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్. చిత్రంలో కొప్పుల ఈశ్వర్, జీవన్‌రెడ్డి. పాదయాత్రగా తరలివచ్చిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

# నిరుడు నిండుగ నీళ్లు.. నేడు ఎందుకీ కన్నీళ్లు?

మొదటిపేజీ తరువాయి...

మారాయని వాపోయారు. 'తలాపున పారుతుంది గోదారి నీ చేను నీ చెలుక ఎడారి'.. అని నాటి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నీటి కష్టాలను వివరిస్తూ, నాటి కవి సదాశివుడు రాసిన పాటను తిరిగి గుర్తు చేసుకొనే పరిస్థితులు తలెత్తడం శోచనీయమని పేర్కొన్నారు. ఎండిన గోదావరి కన్నీటి గోసను, కాళేశ్వరం నీళ్లందక పంటలు ఎండిన రైతుల గుండె కోతను సభ్య సమాజానికి తెలిపేందుకు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో రామగుండం నుంచి ఎర్రవల్లి వరకు (180 కి.మీ) 200 మంది చేపట్టిన పాదయాత్ర వారం పాటు సాగి శనివారం ముగిసింది. ఎర్రవల్లి నివాసంలో తన అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభలో కేసీఆర్ మాట్లాడారు. పోయిన సంవత్సరం ఇదే రోజు నిండు కుండల్లా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులు నేడు ఎందుకు ఎండిపోయాయో, ఇందుకు కారణం ఎవరనేది సమాజానికి తెలియజేసేందుకు కోరుకంటి చందర్ అధ్వర్యంలో పాదయాత్ర చేయడం అభినందనీయమని కొనియాడారు. పాదయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ కేసీఆర్ అభినందించారు.

తెలంగాణ సంపదను కొల్లగొట్టేందుకు అందరు గుంటనక్కల మాదిరిగా కన్నేశారని,

> గల్లీ చిన్నది గరిబోళ్ల కథ పెద్దది వంటి గోరటి వెంకన్న పాటల స్ఫూర్తితో పేదలకు ఇండ్లు నిర్మించినం. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తుంటే.. కేసీఆర్ అన్నా.. ఎక్కడున్నవు రావే.. రావే.. అని బాధతోటి పిలుస్తున్నరు. నన్ను ఓడగొట్టి ఇంట్ల కూర్చోబెట్టిండ్రు ! ఇప్పుడు నేను ఏడికి రావాలె? కత్తి ఒకనికిచ్చి యుద్ధం ఒకరిని చెయ్యమంటే ఎట్లయితది?
>
> - కేసీఆర్



మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భుజంతట్టి సరదాగా సంభాషిస్తున్న కేసీఆర్. చిత్రంలో కోరుకంటి చందర్, జీవన్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి

వీరి పట్ల తెలంగాణ యువత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తెలంగాణను ఆగం చేసే కుట్రలను ఎప్పటికప్పుడు పసిగట్టి కాపాడుకోవాలని సూచించారు.

### నిర్లక్ష్యం వల్లే నీళ్ల సమస్య

కొట్లాడి తెలంగాణను సాధించుకున్నామని, ఎంతో జాగ్రత్తగా దాన్ని నిలబెట్టుకున్నామని కేసీఆర్ చెప్పారు. 'ప్రజలు ఏమనుకున్నారో ఏందో కొత్త ప్రభుత్వాన్ని తెచ్చుకున్నరు. అది వాళ్లిష్టం. కానీ దాని ఫలితం లోకం చూస్తున్నది. ఇన్నాళ్లు లేని నీటి గోస ఇప్పుడెందుకు వచ్చినట్టు? తెలంగాణకు నీళ్లివ్వాలనే పాలనా ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే తెలంగాణకు సాగు, తాగు నీళ్ల సమస్య వచ్చింది. తెలంగాణలో ఉమ్మడి రాష్ట్ర పాలకులు మొదటి నుంచీ నీటి సమస్యను ఆర్థిక సమస్యగా చూడటం ఒక అవలక్షణంగా మార్చుకున్నారు. గల్ఫ్ లాంటి ఎడారి దేశాల్లో నీళ్లుండవు. అక్కడి ప్రభుత్వాలు సముద్ర జలాల నుంచి ఉప్పును వేరుచేసి నీటిని శుద్ధి చేసి మంచినీళ్లుగా వాడుకుంటారు. మద్రాస్‌లో కూడా నీటి కొరతను అధిగమించేందుకు అటువంటి కార్యాచరణను చేసింద్రు. భౌగోళిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజల శ్రేయస్సును పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వాలు పనిచెయ్యాలె. అంతేతప్ప వాటిని ఖర్చుకు లింకుపెట్టి ఆలోచన చేయడం తప్పు. తెలంగాణకు సాగునీరు, తాగునీరు అవసరం. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుకు వెనుకాడకుండా ప్రజలకు తాగునీరు, వ్యవసాయానికి సాగు నీరు అందించాల్సిందే' అని కేసీఆర్ స్పష్టంచేశారు.

### తెలంగాణకు కాంగ్రెస్సే ప్రధాన శత్రువు

**తెలంగాణకు** మొదటి నుంచి ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీయేనని కేసీఆర్ పునరుద్ఘాటించారు. తెలంగాణ సాయుధ పోరాట కాలం నుంచి నేటి దాకా పలు సందర్భాల్లో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను కేసీఆర్ వివరించారు. నెహ్రూ సహా ఇందిరాగాంధీ, సోనియాగాంధీ నుంచి నేటిదాకా తెలంగాణకు కాంగ్రెస్ చేసిన ద్రోహాలను వెల్లడించారు. తెలంగాణను ఆంధ్రాలో కలపడం నుంచి, 1969లో వందలాది మంది బిడ్డలను పొట్టన పెట్టుకోవడం నుంచి, నీళ్లు నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు దశాబ్దాల కాలంగా జరిగిన అన్యాయాలను పూసగుచ్చినట్టు వివరించారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను మొదటినుంచీ కనీస స్థాయిలో ప్రతిఘటించలేని నాటి నాయకత్వం ఎంతో నష్టం చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'వాళ్ల తెలివి తక్కువ తనం చూసి, ఉద్యమ కాలంలో నేను వాళ్లను దద్దమ్మలు, సన్నాసులు అని తెలంగాణ సమాజం తరపున అన్న తప్ప, నాకు వ్యక్తిగతంగా ఎవరి మీదా కోపం ఎందుకు ఉంటుంది? అని చెప్పారు.

### మనం ఇచ్చిన కరెంటు ఎటుపోయింది?

తెలంగాణ రాష్ట్రం సిద్ధించగానే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, వ్యవసాయ స్థిరీకరణపై దృష్టి పెట్టి పటిష్టమైన కార్యాచరణను అమలు చేసిందని కేసీఆర్ గుర్తుచేశారు. 'వ్యవసాయ రంగ అభివృద్ధిని పాలనా ప్రాధాన్య అంశంగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంచుకున్నది. అందులో భాగంగా ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందివ్వడం. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తు ఉచితంగా అందించడం.. పంట పెట్టుబడి సాయం చేయడం.. పండిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయడం అనే అంశాలను ప్రాధాన్యతగా తీసుకొని ఎన్ని కష్టాలొచ్చినా నాటి అమలు చేసింది. కానీ, ఇప్పుడున్న ప్రభుత్వం వీటిని అందించేందుకు ఖర్చువుతుందని వెనుకాడుతున్నది. ఇది సరి కాదు. ఎప్పుడైనా ప్రభుత్వాలే రైతుల దగ్గర భూమి శిస్తులు వసూలు చేసిన సందర్భాలున్నాయి. కానీ, ఉల్టా ప్రభుత్వమే రైతుకు భరోసా కల్పించేలా పంట పెట్టుబడి అందించిన పరిస్థితి ఈ దేశంలో ఉన్నదా? రైతు సంక్షేమం దిశగా ఆలోచించింది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఈ పరిస్థితులను తెలంగాణ సమాజం ఇప్పటికైనా అర్థం చేసుకోవాలె. మనం ఇచ్చిన కరెంటు ఎటు పోయింది? మనం ఇచ్చిన మిషన్ భగీరథ తాగునీరు ఎందుకు ఇవ్వలేకపోతున్నరు? ఎండాకాలంలో కూడా మత్తడి దుంకిన చెరువులు ఇప్పుడు ఎందుకు నీరు లేక ఎండిపోతున్నాయో.. ప్రజలు అర్థం చేసుకోవాలె' అని కేసీఆర్ సూచించారు.

> తెలంగాణకు మొదటి నుంచి ప్రధాన శత్రువే కాంగ్రెస్ పార్టీ. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను మొదటినుంచీ కనీస స్థాయిలో ప్రతిఘటించలేని నాటి నాయకత్వం ఎంతో నష్టం చేసింది. వాళ్ల తెలివితక్కువతనం చూసి ఉద్యమ కాలంలో నేను వాళ్లను దద్దమ్మలు, సన్నాసులు అని తెలంగాణ సమాజం తరపున అన్న తప్ప, నాకు వ్యక్తిగతంగా ఎవరి మీదా కోపమెందుకుంటది?
>
> - కేసీఆర్

### కత్తి ఒకనికి ఇచ్చి.. యుద్ధం ఒకరిని చెయ్యమంటె ఎట్ల?

పల్లెల నుంచి హైదరాబాద్ వంటి పట్టణాలకు బతకడానికి వచ్చిన పేదలకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని, కానీ ఇప్పుడున్న ప్రభుత్వం వాళ్ల ఇండ్లను కూల్చివేస్తున్నదని కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'గోరటి వెంకన్న లాంటి కవులు రాసిన.. గల్లీ చిన్నది గరీబోళ్ల కథ పెద్దది.. వంటి పాటల స్ఫూర్తితో పేదలకు ఇండ్ల నిర్మాణం చేపట్టినం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తుంటే.. కేసీఆర్ అన్నా.. ఎక్కడున్నావు రావే.. రావే.. అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ, నన్ను ఓడగొట్టి ఇంట్ల కూర్చోబెట్టిండ్రు కదా! నేను ఎక్కడికి రావాలె? కత్తి ఒకనికి ఇచ్చి యుద్ధం ఒకరిని చెయ్యమంటే ఎట్లా అయితది?' అని కేసీఆర్ ప్రశ్నించారు.

### కుట్రలను పసిగట్టి కాపాడుకోవాలె

'ఇప్పుడున్న పాలకులు సరిగా చేస్తలేరట! మంచిగ పాలన చేయాలంటే చంద్రబాబు రావాలట! తెలంగాణలో వచ్చేసారి ఎన్డీయే కూటమి రావాలని కొన్ని పత్రికలు కథనాలు రాస్తున్నయి. అంటే తెలంగాణను తెర్లు చేయాలని చూసే వాళ్ల పరిస్థితి ఏమిటో మనం అర్థం చేసుకోవచ్చు. తెలంగాణను ఆగం చేయడానికి కొందరు రెడీగా ఉంటరు. వీరి పట్ల తెలంగాణ యువత అప్రమత్తంగా ఉండాలె. ఎప్పటికప్పుడు తెలంగాణను ఆగం చేసే కుట్రలను పసిగట్టి రాష్ట్రాన్ని కాపాడుకోవాలె' అని కేసీఆర్ సూచించారు. 'ఒక్క పొరపాటు జరిగితే జీవితకాలం దుఃఖపడాల్సి వస్తది. ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను, ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపీలను గెలిపిస్తే.. ఏకాణా కూడా పని కాలేదు. తెలంగాణ నుంచి మన బీఆర్ఎస్ ప్రతినిధులను పార్లమెంటుకు పంపిస్తే కొట్లాడి మన హక్కులు కాపాడుకుందుము కదా! మన దగ్గర ఎంపీల బలం ఉంటే, కేంద్రం మీద ఒత్తిడి చేసి రాష్ట్రాన్ని బాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఈ దిశగా తెలంగాణ సమాజం ఆలోచన చెయ్యాలె' అని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే పుట్ట మధు, పాదయాత్ర చేసిన బీఆర్ఎస్ నేతలు, వందలాది కార్యకర్తలు పాల్గొన్నారు

### మనసుతో యాత్రలు చెయ్యాలె

'కేసీఆర్ ప్రభుత్వంలో పదేండ్ల పాటు ప్రశాంతంగా బతికామని తెలంగాణ సమాజం భావిస్తున్నది. ఇప్పుడు మళ్లీ పాదయాత్రలు, ధర్నాలు, కొట్లాటలు మొదలైనయి. తెలంగాణకు ఎప్పుడూ ఇదే లొల్లా? ప్రశాంతంగా బతుకొద్దా? తెలంగాణ సమాజం ఇకనైనా తెలివిగా ఆలోచన చేయాలి. పాదయాత్రలు కాదు.. మన మనసుతో యాత్రలు చెయ్యాలె. బుర్రతో ఆలోచనలు చెయ్యాలె. ప్రశాంతంగా ఉన్న తెలంగాణను పాడు చేసుకునే ఆలోచనలు కాకుండా మన భవిష్యత్తు తరాలను మరింతగా బాగు చేసుకునే దిశగా ఆలోచన చెయ్యాలె' అని ఉద్బోధించారు.

> ఇప్పుడున్న పాలకులు పనిచేస్తలేరట! మంచిగ పాలన చేయాలంటే చంద్రబాబు రావాలట! తెలంగాణలో వచ్చేసారి ఎన్డీయే కూటమి రావాలని కొన్ని పత్రికలు రాస్తున్నయి. తెలంగాణను తెర్లు చెయ్యడానికి కొందరు రెడీగా ఉంటరు. వీరి పట్ల తెలంగాణ యువత అప్రమత్తంగా ఉండాలె. ఎప్పటికప్పుడు తెలంగాణను ఆగం చేసే కుట్రలను పసిగట్టి రాష్ట్రాన్ని కాపాడుకోవాలె.
>
> -కేసీఆర్

## గోదావరి-బనకచర్లపై చర్చించాల్సిందే

**పోలవరం ప్రాజెక్టు అథారిటీకి తెలంగాణ సర్కారు లేఖ**

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): ఏపీ ప్రభుత్వం అక్రమంగా చేపట్టిన పోలవరం లిఫ్ట్ ఇరిగేషన్, గోదావరి- బనకచర్ల ప్రాజెక్టులపై చర్చించాల్సిందేనని తెలంగాణ డిమాండ్ చేసింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీకి తెలంగాణ సర్కారు తాజాగా లేఖ రాసింది. సుప్రీంకోర్టు ఆదేశాలు, కేంద్ర జల్‌శక్తి శాఖ మార్గదర్శకాల మేరకు పోలవరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో ఏర్పడుతున్న ముంపు ప్రభావం అంశాలపై చర్చించేందుకు పీపీఏ ఈ నెల 27న ఏపీ, తెలంగాణలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశంలో చర్చించేందుకు ఎజెండా పంపాలని ఇరు రాష్ట్రాలకు సూచించగా.. తెలంగాణ తాజాగా ఎజెండాను పీపీఏకు పంపింది. అందులో ప్రధానంగా ఏపీ కొత్తగా చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాలని ప్రతిపాదించింది. ఏపీ సర్కారు ఎలాంటి అనుమతులు లేకుండా, పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా వరద జలాల పేరిట 200 టీఎంసీల గోదావరి జలాలను బనకచర్లకు, అటు నుంచి పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఉపక్రమించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుతో తెలంగాణ జల హక్కులకు విఘాతం ఏర్పడనుంది. ఈ నేపథ్యంలో దీనిపై చర్చించాలని లేఖలో తెలిపింది. పోలవరం విస్తరణ పనులపై కూడా అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని కూడా సమావేశ ఎజెండాలో పొందుపరచాలని కోరింది.

## బీసీ బిల్లు కేంద్రంతో ఆమోదింపజేయాలి

- అడ్డంకుల తొలగింపునకు ప్రభుత్వం గట్టిగా కొట్లాడాలి
- మా పోరాటం వల్లే వేర్వేరు బీసీ బిల్లులు: ఎమ్మెల్సీ కవిత

కొమురవెల్లిలో బోనం ఎత్తిన ఎమ్మెల్సీ కవిత

చేర్యాల, మార్చి 22 : తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ డిమాండ్‌కు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు బీసీ బిల్లులను పెట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులు ఆమోదం పొందినందున ప్రభుత్వం తదుపరి అడుగు వేయాలని డిమాండ్ చేశారు. చట్టాలను కేంద్రం నుంచి ఆమోదించుకుని అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆమోదించిన చట్టాలను ఎవరైనా కోర్టులో సవాలు చేస్తే ప్రభుత్వం గట్టిగా కొట్లాడాలని సూచించారు. బహుజనుల హక్కుల కోసం తెలంగాణ నుంచే ఉద్యమ పొలికేక మొదలైందని అన్నారు. బహుజనుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని శనివారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారులతో పట్నం వేయించి మొక్కులు చెల్లించుకున్నారు. బీసీ బిల్లులు ఆమోదం పొందినందున ఎమ్మెల్సీ కవిత మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం మల్లన్న క్షేత్రం ఆవరణలోని గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. 50 శాతానికిపైగా రిజర్వేషన్లు కల్పిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణతోసహా 10 రాష్ట్రాలు ఉన్నాయని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలైన తర్వాత తెలంగాణలో 54 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నట్టు చెప్పారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలిగిపోయిన నేపథ్యంలో కోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిగా వాదించాలని సూచించారు. రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలకు కలిపి ఒకే బిల్లుపెడితే బీసీలకు అన్యాయం జరుగుతుందని తొలి నుంచి తాము వాదిస్తున్నట్టు చెప్పారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొమురవెల్లి మల్లన్నకు ప్రభుత్వం తరపున తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 130 ఎకరాల భూమిని కేటాయించినట్టు కవిత తెలిపారు. కేసీఆర్ హయాంలో మల్లన్న క్షేత్రం అభివృద్ధి చెందిందని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ సంపత్, యూపీఎఫ్ కోకన్వీనర్ బొల్ల శివశంకర్, యూపీఎఫ, జాగృతి నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎన్జీటీ ఆదేశాలను పాటించాలి

**రాయలసీమ లిఫ్ట్ పనులు ఆపాలి**

**సామాజిక కార్యకర్త శ్రీనివాస్**

హైదరాబాద్, మార్చి22 (నమస్తే తెలంగాణ): కేంద్ర పర్యావరణ శాఖ ఈఏసీ ఆదేశాల ప్రకారం ఏపీ ప్రభుత్వం వెంటనే రాయలసీమ ఎత్తిపోతల పనులను నిలిపివేయాలని, ఇప్పటివరకు పంపుహౌస్, అప్రోచ్ చానల్ పనులకు చేసిన భారీ తవ్వకాలను సత్వరమే పూడ్చివేయాలని సామాజిక కార్యకర్త, ఎన్జీటీ పిటిషనర్ గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పనులు చేపట్టిన ప్రాంతాన్ని పూర్వపు స్థితికి తేవాలన్న ఈఏసీ సిఫారసులను పాటించాలని కోరారు. లేదంటే ఈ విషయంలో ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఏపీ సీఎస్‌గా ఉండి ప్రాజెక్ట్ కట్టి, ఎన్జీటీతో చీవాట్లు తిని, అక్కడ ప్రజాధనం వృథా చేసిన ఆదిత్యనాథ్‌దాస్‌ను తెలంగాణకు నీటిపారుదల సలహాదారుగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు.



మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇంటికి తాళం వేసిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు

## పన్ను కట్టలేదని ఇంటికి తాళం

- గంటలోపే చెల్లించిన యజమాని

మంచిర్యాలటౌన్, మార్చి 22: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సున్నంబట్టి వాడలలో ఇంటి పన్ను చెల్లించని లేదని కార్పొరేషన్ అధికారులు ఓ ఇంటికి తాళం వేశారు. ఆస్తిపన్ను ఐదేండ్లుగా చెల్లించడం లేదని అధికారులు ఆ ఇంటి యజమాని స్వామికి తెలుపగా ఆయన స్పందించలేదు. గడువు పూర్తికావడంతో రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ఇంటికి వెళ్లి తాళంవేశారు. విషయం తెలుసుకున్న ఇంటి యజమాని గంటలోపే చెల్లించాల్సిన మొత్తం పన్ను రూ.31వేలు చెల్లించాడు. అలాగే పట్టణంలోని బైపాస్‌రోడ్డులో షౌకత్ బేగంకు చెందిన వెల్డింగ్‌దుకాణానికి సంబంధించిన ఆస్తిపన్ను రూ. 24వేలు మూడేళ్లుగా కట్టక పోవడంతో దుకాణానికి తాళం వేశారు.

## 'చైల్డ్ రైట్స్' చైర్‌పర్సన్‌గా తెలంగాణ వ్యతిరేకి?

- అర్హతలేని మహిళ నియామకానికి రంగం సిద్ధం చేసిన రాష్ట్ర సర్కారు
- నేడో, రేపో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడుతాయని ప్రచారం
- అధికార పార్టీలో రాజకీయ దుమారం

హైదరాబాద్, మార్చి 22 (నమస్తే తెలంగాణ): అర్హత లేని ఓ మహిళా నేతకు రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించనున్నారా? ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన ఆంధ్రా మూలాలున్న మహిళను అందలమెక్కించనున్నారా? సామాజిక సేవతో సంబంధంలేని, పూర్తిగా రాజకీయ నేపథ్యమున్న వ్యక్తిని నియమించనున్నారా? అనే ప్రశ్నలకు ఆవుననే సమాధానం వస్తున్నది. ఇప్పటికే ఈ దిశగా కాంగ్రెస్ సర్కారు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. ఒకటి, రెండ్రోజుల్లో ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉన్నది. ఆమె నియామకంపై రాష్ట్రంలో రాజకీయ దుమారం రేగుతున్నది. ముఖ్యంగా రాష్ట్ర అధికార పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నట్టు తెలుస్తున్నది.

### నిబంధనలు బేఖాతరు..

సాధారణంగా కనీసం ఏడేండ్లు సమాజాభివృద్ధి, బాలల అభ్యున్నతికి కృషిచేసి 35 ఏండ్లు నిండిన వ్యక్తులకు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమించాల్సి ఉంటుంది. గతంలో రాజకీయ నేపథ్యమున్నవారికి ఈ పదవిని అప్పగించేందుకు యత్నించగా కోర్టులు అభ్యంతరం చెప్పాయి. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఈ నిబంధనలను బేఖాతరు చేస్తున్నది. గతంలో దక్షిణ తెలంగాణలోని ఓ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసిన ఫక్తు రాజకీయ నేతను ఈ సీట్లో కూర్చోబెట్టేందుకు సంసిద్ధమైనట్టు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

### ఆమె కోసమే తిరిగి నోటిఫికేషన్..

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్, ఆరుగురు సభ్యుల నియామకానికి ప్రభుత్వం జనవరి 31, 2024న నోటిఫికేషన్ ఇచ్చింది. సమాజసేవ, బాలల హక్కుల కోసం కృషి చేసినవారు అర్హులని వెల్లడించింది. ఈ క్రమంలో సుమారు 450 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అనర్హుల దరఖాస్తులను తిరస్కరించారు. అయితే, ప్రభుత్వ పెద్దకు అనుకూలమైన నాయకురాలు ఎంపిక జాబితాలో కనిపించలేదు. దీంతో నవంబర్ 25, 2024న మళ్లీ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో సదరు మహిళా నేత దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు చైర్‌పర్సన్ పదవి కట్టబెట్టాలని ముందే నిర్ణయించుకున్న ప్రభుత్వ పెద్ద చకచకా పావులు కదిపారు.

### అధికార పార్టీలోనూ ధిక్కార స్వరాలు..

కీలక పదవి ఎంపిక విషయంలో అధికార పార్టీలోనూ ధిక్కార స్వరాలు వినిపిస్తున్నట్టు తెలుస్తున్నది. కొంతకాలం కిందటే పార్టీలో చేరిన నాయకురాలు పార్టీ కోసం చేసిందేమీలేదని చెబుతున్నట్టు తెలుస్తున్నది. ఓ వైపు కోర్టు కొట్టేస్తుందనే భయం, పార్టీలోనూ భిన్నస్వరాలు వినిపిస్తుండడంతో ఎంపిక ప్రక్రియ ఆలస్యం కానున్నట్టు పలువురు నాయకులు ఈ మేరకు చెబుతున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

## 'పాలమూరు' నీళ్లు ఇవ్వాలి

- సాగు జలాల్లో అన్యాయం చేయొద్దు
- పాలమూరు ఎమ్మెల్యేలదే బాధ్యత
- పాలమూరు అధ్యయన వేదిక రౌండ్‌టేబుల్ మీటింగ్‌లో వక్తలు

కల్వకుర్తి, మార్చి 22 : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నుంచే సాగునీళ్లు పారించాలని పాలమూరు అధ్యయన వేదికలో వక్తలు కోరారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని టీయూటీఎఫ్ భవనంలో పాలమూరు అధ్యయన వేదిక, కల్వకుర్తి జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, ఇరిగేషన్ నిపుణులు కేవీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పార్టీలకతీతంగా హాజరైన పలువురు.. జలదోపిడీపై ఆవేదన వ్యక్తంచేశారు. సాగునీటి విషయంలో మొదటి నుంచి మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం జరుగుతున్నదని అన్నారు. 1956 ఉమ్మడి ఏపీ ఏర్పాటుతోనే ఈ ప్రాంతానికి అన్యాయం ప్రారంభమైందని తెలిపారు. కండ్ల ముందే మనకు దక్కాల్సిన సాగునీటిని నల్లగొండ జిల్లాకు తరలించుకుపోతుంటే అడ్డుకోవాల్సిన జిల్లా ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఇకపై అన్యాయం జరుగకుండా చూడాల్సిన బాధ్యత ఉమ్మడి జిల్లాకు చెందిన 14 మంది ఎమ్మెల్యేలదేనని వారు స్పష్టం చేశారు. పాలమూరు లిఫ్ట్ నుంచి నల్లగొండకు సాగునీరు ఇవ్వొద్దని సూచించారు. పాలమూరు పథకం నుంచి సాగునీరు తరలింపును అడ్డుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది.

## టెక్నికల్ అనుమతి లేదు... ఉన్నది పొలిటికల్ అనుమతే

- దేవాదుల పంపులు ఆన్ చేసే ప్రక్రియలో చిత్ర విచిత్రాలు
- మోటర్ల కంపెనీ ఇంజినీర్ లేకుండా మంత్రుల నిర్ణయం
- సాంకేతిక అనుమతి అసలే ఇవ్వని ఆస్ట్రియా దేశ కంపెనీ
- మాన్యువల్‌గా ఆన్ చేసేందుకు అధికారుల విఫలయత్నం

హనుమకొండ జిల్లా దేవన్నపేటలోని దేవాదుల మూడో దశ పంపు హౌస్

వరంగల్, మార్చి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హనుమకొండ, జనగామ, కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 60 వేల ఎకరాలకు సాగునీరు అందించే దేవాదుల పంపు హౌస్‌ను వినియోగంలోకి తేవడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం బయటపడింది. సాగునీటి నిర్వహణలో కీలకమైన సాంకేతిక అనుమతులు లేకుండానే పబ్లిసిటీ కోసం మంత్రులు ఉత్తమ్‌కుమార్, పొంగులేటి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం హడావుడిగా దేవన్నపేట పంపు హౌస్‌లోని మోటర్లను ఈ నెల 18న ఆన్ చేసేందుకు వచ్చారు. మోటర్లను బిగించిన ఆస్ట్రియాకు చెందిన అండ్రీజ్ కంపెనీ సాంకేతిక అనుమతి ఇవ్వకపోవడంతో.. అధికారులు మాన్యువల్‌గా ఆన్ చేయబోయి విఫలమ్యారు. ఇదితెలిసిన ఆస్ట్రియా కంపెనీ .. సాంకేతిక నిపుణులే కుండా మోటర్లను ఆన్ చేస్తే తదుపరి పరిణామాలకు తాము బాధ్యత తీసుకునేది లేదని స్పష్టం చేసింది. సాగునీటి శాఖ సూచన మేరకు ఆస్ట్రియా కంపెనీకి చెందిన ప్రొటోకాల్ ఇంజినీర్ శనివారం దేవన్నపేట పంపుహౌస్‌కు చేరుకున్నారు. పంపులను ప్రతి దశలో పరిశీలించాలని, ఇంకా సమయం పడుతుందని ఈ ఇంజినీర్ చెప్పడంతో పంపులను ఆన్ చేసే ప్రక్రియను మరోసారి వాయిదా వేశారు.